



పీఎఫ్ కోసం పడిగాపులు

- జూలై నుంచి నిలిచిన చెల్లింపులు
- 600 మంది ఉద్యోగులకు రూ.80 కోట్లు
- జడ్పీలో బిల్లులన్నీ క్లియర్.. సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్


జిల్లా పరిషత్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ సొమ్మును దారిమళ్లించి ఐదేళ్ల ఇబ్బంది పెట్టగా.. కూటమి ప్రభుత్వంలో చెల్లింపులు జరగక వారు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) చెల్లింపు లు నిలిచిపోయాయి. గత ఏడాది జూలై నుంచి చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందిన సుమారు 600 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.80 కోట్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. సంబంధిత బిల్లులన్నీ జిల్లా పరిషత్ నుంచి ఎప్పుడో క్లియర్ చేశారు. ఇక్కడ నుంచి వెళ్లిన బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. నెలల తరబడి పీఎఫ్ చెల్లింపులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో 10 వేల మంది పీఎఫ్ చందాదారులు ఉండగా వారికి సంబంధించి సుమారు రూ.300 కోట్ల పీఎఫ్ మూలధనం ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా 12 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాకు జమ చేస్తారు. ఒక వేళ ఉద్యోగికి ఇన్సూరెన్స్ లేకపోతే జీతంలో 6 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్ము ఉద్యోగి ఆర్థిక భద్రత కొరకు మాత్రమే ఉద్దేశించబడింది. ఉద్యోగి తన పీఎఫ్ ఖాతా లో ఉన్న సొమ్ముపై అవసరమైనప్పుడు రుణం పొందవచ్చు. దీంతో ఉద్యోగులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు వ్యాపారుల వద్ద వడ్డీరేట్లు భరించలేక పీఎఫ్ సొమ్మును వాడుకుంటుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూన్ వరకు పీఎఫ్ బకాయిలు అన్నింటినీ క్లియర్ చేసింది. జూలై తర్వాత వచ్చిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. జిల్లా పరిషత్‌లో ప్రతి నెలా సుమారు 100 మంది ఉద్యోగులు పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేస్తుంటారు. ప్రతి నెలా రూ.6 కోట్లకు తగ్గకుండా పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వం మారిన తర్వాత పాత చెల్లింపులు జరగడంతో చాలా మంది ఉద్యోగులు రుణం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎనిమిది నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

ఈ నెలలో చెల్లింపులు..

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చెందిన పీఎఫ్ బకాయిలు అన్నీ ఈ నెలలో క్లియర్ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం మోక్షం కల్పిస్తుందని అంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఈ నెలలో పీఎఫ్ చేతికి వస్తుందన్న ఆశతో ఉన్నారు.



అవకతవకలపై.. అలసత్వం

- రాయితీ యంత్రాల పంపిణీలో గోల్‌మాల్
- విచారణకు ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఆదేశం
- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఇటీవలే ఆడిట్ పూర్తి.. వివరాలు బహిర్గతంపై గోప్యత
- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు శూన్యం

రైతులకు సాంకేతిక సహకారం అందించి ఆధునిక వ్యవసాయంపై మళ్లించడం.. తద్వారా సాగులో నష్టాలను తగ్గించడం.. లాంటి లక్ష్యాలతో రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పరిక రాలను ప్రభుత్వం అందిస్తుంటోంది. అయితే గత వైసీపీ హయాంలో తొలుత వీటి గురించి పట్టించుకోకుండా చివరి రెండేళ్లలో యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. అయితే రైతుల పేరిట వైసీపీ నేతల అనుచరులకే పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. నాడు వ్యవసాయశాఖ ఈ ఆరోపణలు పట్టించుకోలేదు. అసలు రైతులే కాని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి అడ్డగోలుగా ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అవకతవకలపై విచారణకు ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ శాఖలో స్పందన లేదని రాయితీ యంత్రాల పరికరాల పంపిణీలో జరిగిన అవక తవకల వెలికితీతపై జరుగుతున్న తాత్సారంతో తేటతెల్ల మవుతోంది. తూతూ మంత్రంగా జరిపిన ఆడిట్ నివేదిక లను కూడా బహిర్గత పరచకుండా గోప్యత పాటిస్తుం డటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో అనర్హులు లబ్ధి పొంది దర్జాగా అనుభ విస్తున్న వారిపై చర్యలు లేకపోగా వ్యవస్థలు చోద్యం చూడడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ఈ అంశాలను తేల్చాలి..

- యూనిట్లకు ఎంపిక చేసిన గ్రూపులోని సభ్యులు ఎవరు.
- వారందరూ రైతులేనా.. ఆ ఫలాలు పొందడానికి అర్హులేనా.
- రాయితీ యంత్రాలు కేటాయించిన దగ్గర నుంచి ఎంత మంది రైతులకు అద్దెకిచ్చారు.వాటి ద్వారా వసూలైన అద్దె మొత్తాలెంత.
- యంత్రాలన్నీ రైతు సేవా కేంద్రాల్లోనే ఉంటున్నాయా లేక అమ్ముకున్నారా..
- రైతుల పేరిట తీసుకున్న వాటిలో కొన్ని యంత్రాలను ఏకంగా అమ్మేసుకున్నారు.. వీటిని గుర్తించాలి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు రాయితీపై యంత్రాలను ప్రభుత్వాలు అందిస్తుంటాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా జారీ చేసిన యూనిట్లలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకు న్నాయి. తొలి మూడేళ్లు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ ఊసె త్తని ప్రభుత్వం చివరి రెండేళ్లలో యూనిట్లు అందించడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఆ పరికరాలు అందుకున్నది రైతులంటే పప్పు లో కాలేసిన ట్లే.

ఇళ్లల్లోనే 200 యూనిట్లు.. 450 అదృశ్యం

ప్రభుత్వ ఆదేశాలతో యంత్ర పరికరాల ఆడిట్‌ను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉండాల్సిన దాదాపు 200 యూనిట్ల యంత్ర పరికరాలు ఇప్పటికీ వైసీపీ నేతల అనుచరుల ఇళ్ల వద్దనే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం. మూడు జిల్లాల పరిధిలో మరో 450 వరకు పరికరాలు అదృశ్యమైనట్లు ఆడిట్‌లోనే వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇళ్ల వద్దకు వెళ్లి పరికరాల పై అధికారులు విచారణ నిర్వహించడంపై అనుమానాలు వస్తున్నాయి.

రైతులకు మేలు చేసే పేరిట ఈ రాయితీలను కూడా వైసీపీ నేతాగణం అనుచరులకే దోచి పెట్టిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. ఈ రాయితీ యంత్రాల యూనిట్లలో జరిగిన కిరికిరికి సంబంధించి విచారణకు గతేడాది జూలైలోనే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇప్పటి వరకు దానిపై పురోగతి ఏమిటనే దానికి వ్యవసాయశాఖ నుంచి సమాధానమే లేదు. యంత్రపరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలన్నది గత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లోనే ఉంది. ప్ర భుత్వం మారినా ఆ ఆదేశాలు అమలు కాకపోగా ఇళ్ల దగ్గరకు వెళ్లి అధికారులు ఆడిట్ నిర్వహించడం ఏమిటన్నది తెలియాలి. ఇతర రైతులకు పరికరాలను

(మిగతా 8వ పేజీలో)

నిరుద్యోగులకు తీపికబురు

వయో పరిమితి సడలింపుతో లబ్ధి

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఊరట
- డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు రాసేవారికి ఉపయోగం


కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువత

గుంటూరు(విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇప్పటి వరకు ఉన్న వయోపరిమితిని సడలిస్తూ నూతన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షతిరేకం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగులకు, త్వరలో జరిగే గ్రూప్ పరీక్షలు రాసే వారికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఒక్క సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఏ పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో వేలమంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు యూనిఫామ్ సర్వీస్ రిక్రూట్మెంట్లో రెండేళ్లు, నాన్ యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల్లో 34 నుంచి 42 వరకు వ యోపరిమితిని సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుద్యోగులకు వరమే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏటా సగటున 25 నుంచి 30 వేల మంది వరకు ఉంటున్నారు. ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తి చేసిన వారు ఐటీ ఉద్యోగాల వైపువెళ్తున్నారు. సాధారణ డిగ్రీతోపాటు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ప్రభుత్వం భర్తీ చేయనున్న మెగాడీఎస్సీ కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేల మంది సన్నద్ధమవుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కొలిక్కి వచ్చింది. గ్రూప్ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. వయోపరిమితి స డలింపు నిరుద్యోగులకు వరమేనని యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

అభివృద్ధికి.. ఇన్‌చార్జి అధికారులు

- గుంటూరు జిల్లాకు కన్నబాబు
- బాపట్లకు కృతికా శుక్ల, పల్నాడుకు కరుణ
- జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా సాయిప్రసాదు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణతో సంక్షేమం వేగవంతం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. గుంటూరు జిల్లాకు సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబుని నియమించింది. బాపట్లకు కృతికాశుక్ల, పల్నాడుకు వీ కరుణని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడుని ఒక జోన్‌లో చేర్చి దానికి ఇన్‌చార్జి అధికారిగా స్పెషల్ సీఎస్ హోదాలో ఉన్న జీ సాయిప్రసాదుని నియమించింది. తొలుత జిల్లా ఇన్‌చార్జి అధికారులు ఆయా జిల్లాలకు వచ్చి కలెక్టర్లతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత జోనల్ ఇన్‌చార్జి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ వల్ల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వేగవంతంగా అందుతాయని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.లక్ష కోట్లు వచ్చేలా

అమరావతి నిర్మాణం

- గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి
- అమరావతిని విచ్ఛిన్నం చేసిన గత వైసీపీ పాలకులు
- భారతీయుల కోసం ఎదురుచూస్తోన్న ప్రపంచ దేశాలు
- ఎస్ఆర్ఎం వర్సిటీలో సీఎం చంద్రబాబునాయుడు


ఎస్ఆర్ఎంలో సీవి రామన్ భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవల్‌మెంట్ అనే అంశంపై అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సు ముగింపు సభలో సీఎం ప్రసంగించారు. గత ఐదేళ్లపాటు గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. 2019 తర్వాత కూడా రాజధాని అమరావతి నిర్మాణాన్ని యధారీతిన కొనసాగించి ఉంటే ఈపాటికి ఈప్రాంత రూపురేఖలన్నీ పూర్తిగా మారిపోయి ఉండేవన్నారు. అలా జరగకపోగా జరిగిన అభివృద్ధిని విచ్ఛిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని అంతటా సోలార్ ఎనర్జీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో నిజమైన పేదలను గుర్తించి వారికి అన్ని విధాలా చేయూత ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే, అన్నీ రంగాల్లో కొనసాగుతున్న పని విధానంలో కూడా మార్పులు రావాల్సి ఉందన్నారు. మగవారి కన్నా మహిళలే వివిధ రంగాలలో రాణిస్తున్నారని, జీతాల విషయంలో కూడా వారిదే పైచేయని చెప్పారు. వ్యవసాయ రంగంలో మరిన్ని ఆధునిక సాంకేతికత వినియోగించాలన్నారు.

జనాభాకు అనుగుణంగా సదుపాయాలు..

జనాభా పెరుగుదల ఆధారంగా మౌలిక సదుపాయాలను కల్పించడం కూడా ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. జనాభా పెరుగులకు అనుగుణంగా ఆహారోత్పత్తి, నీటి వసతిని పెంచాలన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతమైందన్నారు. తెలుగువారు ప్రపంచంలోని అన్నీ దేశాలలో విస్తరించి కీలకరంగాల్లో అగ్రగాములుగా రాణిస్తున్నారన్నారు. జపాన్, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారతీయుల కోసమే ఎదురుచూస్తున్నాయన్నారు.

అంకుర కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విస్తరణకు భూములతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అంకుర కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎస్ఆర్ఎం యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు ఎస్ఆర్ఎంలో అకడమిక్ క్లస్టర్ (రూ.270కోట్లు), వేదవతి-2(రూ.160 కోట్లు),గంగా హాస్టల్-2(రూ.120 కోట్లు), అంతర్జాతీయ పరిశోధనా పార్కు (రూ.200 కోట్లు) నిర్మాణాలకు చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. అనంతరం సీవీ రామన్ బ్లాక్ (రూ.200 కోట్లు), గంగా హాస్టల్ బ్లాకు నెం.1(రూ.150 కోట్లు) భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రణాళికా శాఖ కార్యదర్శి అనంత్‌శంకర్, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వైస్‌చాన్సలర్ ఆచా ర్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ ఆచార్య డి.నారాయణరావు, ప్రణాళికా శాఖ ఈడీ టీఆర్ అలపర్తి, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (బుధవారం)
సహరి : 5.01 (గురువారం)

కారం మిల్లులపై విజిలెన్స్

- రూ.17.43 లక్షల కారంపొడి స్వాధీనం
- మిర్చి, పసుపు, ధనియాలు అక్రమ నిల్వల గుర్తింపు


గుంటూరులో కారం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండానే కారం పొడి తయారు చేసి విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్న మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ దాడుల్లో రూ. 17,43,500 విలువ చేసే కారం పొడిని స్వాధీనం చేసుకు న్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గుంటూరులోని చిలకలూరిపేటరోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్ కారం మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లు యజమాని బండారు రవీంద్రకుమార్ ఎటువంటి బిల్లులు, రికార్డులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మిర్చి యార్డు దగ్గరలో ఉన్న మోహన్‌లాల్ మహేంద్రకుమార్ అండ్ కంపెనీ నుంచి బిల్లులు లేకుండా మిర్చి తీసుకువచ్చి కారం పొడి తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. 13,915 కేజీల చిల్లీ పౌడర్, రూ.3,14,250 విలువ చేసే 1815 కేజీల మిరపకాయలు, 75 కేజీల పసుపు, రూ.1,06,854 విలువ చేసే 1320 కేజీల ధనియాలు బిల్లులు లేకుండా కలిగి ఉన్నారని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారం పొడి నమూనాలను సేకరించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు హైదరాబాద్‌లోని లేబరేటరీకి పంపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

డ్రోన్లతో జూదరుల ఆటకట్టు
- పేకాట శిబిరాలపై పోలీసుల సాంకేతిక దాడి
- పోలీసుల అదుపులో పదిమంది.. 10 వేల నగదు స్వాధీనం
8

రేషన్ బియ్యం తరలింపు కేసులో.. నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ
6

మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలు నిర్దేశం


- గుంటూరు జిల్లాకు రూ.64.80 లక్షలుగా నిర్దేశం
- పల్నాడు రూ.29.70 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.7.62 కోట్లు..
- ఏఎంసీల సెక్రెటరీలు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రోజు వారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాని ఆ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత నిర్దేశించారు. మంగళవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజు వారీ వసూళ్లతోనే ఆర్థిక సంవత్సర లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఈ విషయంలో సెక్రెటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు కలిపి రోజువారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని రూ.64.80 లక్షలుగా కమిషనర్ నిర్ణయించారు. ఇందులో గుంటూరు ఏఎంసీకి రూ.44 లక్షలు, తెనాలి రూ.5 లక్షలు, పొన్నూరు రూ.5 లక్షలు, దుగ్గిరాలకు రూ.2.50 లక్షలు, తాడికొండ రూ.2 లక్షలు, మంగళగిరికి రూ.2 లక్షలు, ఫిరంగిపురానికి రూ.2 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.2.30 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించారు. పల్నాడు జిల్లాకు రోజు వారి లక్ష్యం రూ.29.70 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో చిలకలూరిపేటకు రూ.3.60 లక్షలు, సత్తెనపల్లికి రూ.2.30 లక్షలు, పిడుగురాళ్లకు రూ.2 లక్షలు, నరసరావుపేటకు రూ.2.10 లక్షలు, వినుకొండకు రూ.2.70 లక్షలు, క్రోసూరుకు రూ.1.95 లక్షలు, మాచర్లకు రూ.1.20 లక్షలు, రొంపిచర్లకు రూ.1.70 లక్షలు, ఈపూరుకు రూ.1.20 లక్షలు, రాజుపాలేనికి రూ.1.50 లక్షలు, దుర్గికి రూ.1.90 లక్షలు, గురజాలకు రూ.7.55 లక్షలు నిర్దేశించారు. బాపట్లలోని ఏఎంసీలన్నింటికి కలిపి రూ.30.27 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.22.65 కోట్లు వసూళ్లు జరిగాయి. ఈ దృష్ట్యా ఏఎంసీల సెక్రెటరీలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. 50 శాతం కంటే తక్కువగా మార్కెట్ ఫీజు వసూళ్లలో తాడికొండ, సత్తెనపల్లి, మాచర్ల, రొంపిచర్ల ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కెటింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలానే ఈపూరు, పిడుగురాళ్ల, కూచినపూడి, పర్చూరు, క్రోసూరు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, మంగళగిరిలో 50 నుంచి 70 శాతం మార్కెట్ ఫీజుల వసూళ్లు జరిగాయి. ఇక 70 నుంచి 90 శాతం తక్కువగా దుర్గి, అద్దంకి, వినుకొండ, బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, గురజాల, వేమూరు, చీరాల, రేపల్లె, ప్రత్తిపాడు, పొన్నూరు ఏఎంసీలున్నాయి. 90 నుంచి 100 శాతం వసూళ్లు చేసిన వాటిల్లో సంతమాగులూరు, దుగ్గిరాల ఉన్నాయి. 100 శాతం లక్ష్యాన్ని అధిగమించిన ఏఎంసీలు మూడు జిల్లాల్లో ఒక్కటి కూడా లేదని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, రామాంజనేయులు, ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరి చంద్రిక, మంగళగిరి ఏఎంసీ సెక్రెటరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన మార్కెటింగ్ సెక్రెటరీలు, మాట్లాడుతున్న కమిషనర్ విజయ సునీత

విద్యావ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో నూతనమార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో భ్రష్టుపట్టించారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అసెంబ్లీ సమావేశంలో మంగళవారం మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల్లో గత పాలకులు అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీసం విద్యార్హతలు లేనివారిని విద్యాశాఖ మంత్రిగా చేసి ఈ రోజు యువత పోరు ఎలా చేస్తారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకోవడమే సరిపోయిందని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఇప్పటికీ కూడా పెండింగ్ ఉన్న బిల్లులు ఉన్నాయని, వాటిని తీర్చడానికే సమయం సరిపోతుందని, కనీసం అసెంబ్లీకి వచ్చి మాట్లాడనివారికి విద్య గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికీ కూడా చాలా కాలేజీల్లో ఫీజులు చెల్లించక రోడ్డుమీద పడ్డారని అన్నారు. ఈ రోజు మేము పారదర్శకంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సర్టిఫికెట్లు పంపిస్తున్నామని, ఈ నెల 17న జరగబోయే 10వ తరగతి పరీక్షలకు కూడా ఆర్టీసీ ద్వారా ఉచిత బస్సు కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో విద్యార్థులకు చెల్లించాల్సిన బాకాయిలు చెల్లించకపోవడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లోకేష్ చొరవతో రూ.20.50కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.110 కోట్లు కూటమిప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

జలజీవన్‌మిషన్‌కి 3025.63 కోట్లు

- గ్రామాల్లో సమృద్ధిగా తాగునీరు అందిస్తాం
- మంత్రి అనగాని



రేపల్లె, మార్చి11(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామాల్లోని ప్రజలకు సమృద్ధిగా అందించేందుకు జలజీవన్ మిషన్ కింద 3025.63కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించటం జరిగిందని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి కోసం కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమంకోసం పనిచేస్తుందని తెలిపారు. జలజీవన్‌మిషన్ కింద గ్రామాల్లో మినీవాటర్‌స్కీమ్‌లు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు నూతన పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు నియోజకవర్గంలోని రేపల్లె,నగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాల్లో 97పనులకు గాను నిధులు మంజూరు చేయించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈగ్రామాల్లో ఆయా పనులను బట్టి రూ.10లక్షల నుంచి 50లక్షల వరకు నిధులు మంజూరుచెయ్యటం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వికాస ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 2025 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, ఇన్చార్జి రిజి స్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్, వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్‌లు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు మాట్లా డుతూ ఉద్యోగులు ఇటువంటి క్రీడల ద్వారా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని అన్నారు. నిరంతరం విధులతో మానసిక ఒత్తిడికి గురవుతారని ఇటువంటి క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు పని ఒత్తిడి తగ్గుతుందని సూచించారు ఇటువంటి క్రీడలు ఉద్యోగుల పట్ల స్నేహభావం పెంపొందిస్తాయని అన్నారు. క్రీడలు నిరంతరం నిర్వహించాలని వికాస కార్యవర్గానికి సూచిం చారు. అనంతరం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వికాస అధ్యక్ష,కార్యదర్శులు నీలపు ప్రసాద్, జవ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కె. యేసయ్య, కార్యవర్గ సభ్యులు నాగరాజు,వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శశిధర్, తదితరులు పోటీల నిర్వహణను పర్యవేక్షించారు.

అట్టహాసంగా ప్రారంభమైన యూజీసీ సెమినార్

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్" అనే అంశంపై జరుగుతున్న సదస్సు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలా రాణి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కే విజయ కిషోర్ మాట్లాడుతూ ఈ సదస్సుకు సుమారు 500కు పైగా రిజిస్ట్రేషన్లు వివిధ యూనివర్సిటీలో మరియు కళాశాలల నుంచి వచ్చాయని తెలిపారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ సునీల్ శర్మ మాట్లాడుతూ ఫార్మసీ, వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్యాన్ని వివరించారు. రెక్టార్ ప్రొఫెసర్ రత్న షీలా మణి విద్యార్థులకు ప్రత్యేక సందేశాన్ని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు సదస్సు సావనీరుని విడుదల చేసి ఆవిష్కరించారు.



వర్సిటీలో క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

29,30 తేదీలలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ సప్లై చైన్ అండ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సదస్సు బ్రోచర్ ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్య ప్రసంగికులుగా అమెరికాలోని వాల్డన్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ కొర్రపాటి రఘు హాజరుకానున్నారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో అంతర్జాతీయ మార్కెట్లో నూతనంగా వచ్చిన సప్లై లాజిస్టిక్ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్టర్ ఆచార్య జి. సింహాచలం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు కేసులో.. నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ

తెనాలి రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పేదలకడుపునింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిలో నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ పోలీసుల రికార్డులోకి ఎక్కా రు. మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ షేక్ సిలార్ జానీబాషా గత ప్రభుత్వంలో బంధువుల పేరుతో రేషన్ డీలర్ షిప్ పొందాడు. ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీకి స్వయంగా వెళుతూ లబ్ధిదారులకు బియ్యం నాణ్యమైనవి కాదని వాటిని తింటే అనారోగ్యసమస్యలు వస్తాయంటూ వారిలో రేషన్ పంపిణీ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి వేలిముద్రలు తీసుకుని బియ్యం బదులుగా కేజీకి రూ.8 నుంచి 10 వంతున ఇచ్చి పంపుతుంటాడు. ఇలా సేకరించిన బియ్యాన్ని నల్లబజార్లకు తరలించి సొమ్ముచేసుకునేవాడు. గత ప్రభుత్వంలో వైసీపీ చోటా నాయకుడు కావడంతో ఇతడివైపు అధికారులు కన్నెత్తికూడా చూసేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున సత్తెనపల్లి తరలించేందుకు రేషన్‌బియ్యాన్ని ట్రాన్స్‌పోర్ట్‌ఆటోలో లోడ్ చేసుకుని వెళుతుండగా పోలీసులను గమనించి వాహనాన్ని వెంబడించారు. దాంతో డ్రైవర్ వాహనాన్ని కొల్లిపర మండలం అత్తోట వైపు దారి మళ్లించాడు. పోలీసులు వాహనాన్ని వెంబడించి వాహనంలో ఉన్న 120 బస్తాల పీడీఎఫ్ బియ్యా న్ని అందులో ఉన్న డ్రైవర్, మరోవ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీటీసీ సిలార్ జానీబాషా వద్ద కొనుగోలు చేసి సత్తెనపల్లి తరలిస్తున్నట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. దీంతో తరలిస్తున్న ఇరువురిని, అమ్మిన సిలార్‌జానీబాషాను, కొనుగోలు చేసిన సత్తెనపల్లికి చెందిన మరో వ్యక్తిని కలిపి మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్ బియ్యంతో పట్టుబడ్డ ట్రాన్స్‌పోర్ట్ ఆటో

ఏప్రిల్ 30న రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశం : కలెక్టర్

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలైనా సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు జాతీయ, రాష్ట రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఏప్రిల్ 30వ తేదీన న్యూఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్‌వో, జిల్లా ఎన్ని కల అధికారి, సీఈవో స్థాయిలో పరిష్కారం జరగని సమస్యలను ఆ సమావేశంలో ప్రస్తావించ వచ్చున్నారు. గతంలో జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను ఈ నెల 31వ తేదీ లోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08479 భువనేశ్వర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 17, 24 తేదీల్లో మధ్యాహ్నం 12.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.50కి చర్లపల్లి చేరుకుంటుంది. నంబరు. 08480 చర్లపల్లి - భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో ఉదయం 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9.50కి భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

యూత్ పార్లమెంట్ రిజిస్ట్రేషన్ 16 వరకు పొడిగింపు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు ఈ నెల 16 వ తేదీ వరకు పొడిగించినట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయడానికి తేదీ పొడిగించారని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, యన్‌టి ఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన "వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ 'అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 16వ తేదీ అర్ధరాత్రిలోగా మై భారత్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలియచేశారు. వివరాలకు యూత్ పార్లమెంట్ నోడల్ అధికారి కిరణ్మయిదేవిరెడ్డిని (9849854221) సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగాలు ఇప్పించటం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 వ తేదీన ఈ కోర్సు తరగతులు మొదలవుతాయి, ఈ కోర్సుకు టెన్త్/ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు 6304292828 అనే నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆంధ్రప్రదేశ్ రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విశాల్ జైశ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆర్‌బీఐ విశిష్టతలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, అధ్యాపకులు ఆచార్య వి.చంద్రశేఖర్, ఏ. కనకదుర్గ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు,(కాపు, బలిజ,తెలగ,ఒంటరి), ఈబీసీ, కమ్మ,రెడ్డి,ఆర్యవైశ్యక్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ మయూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 522.10 అడుగులు ఉంది. ఇది 153.13 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,871 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

హైదరాబాద్ ఎడ్లజతకు ప్రథమస్థానం

రాజుపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల పందెలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన జూనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన డి రోహన్‌బాబు సామ్రాట్ బసవ ఎడ్లజత 2962 అడుగుల దూరంలాగి ప్రథమస్థానంలో, జగమెండి ఎడ్లజత 2790అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి ఎడ్లజత 2759.11అడుగుల దూరంలాగి మూడవస్థానంలో, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన ఆళ్ళ మోహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావుల ఎడ్లజత 2478.8అడుగుల దూరంలాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

వ్యవసాయ విభాగంలో బాపట్ల ఎడ్లజతకు ప్రథమస్థానం

వ్యవసాయ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్లజత 4000 దూరంలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 3926.7అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలువగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య ఎడ్లజత 3893.6అడుగుల దూరంలాగి మూడవస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఆకులగణపవరం గ్రామానికి చెందిన పుట్టా తిరుపతయ్య ఎడ్లజత నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఎడ్లజత

ఉనికి కోసమే వైసీపీ పాట్లు : యరపతినేని



పిడుగురాళ్ళ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎన్నికలలో రాష్ట్రంలో చిత్తు చిత్తుగా ఓడిన జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయాడని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలో వుండగా ప్రజల బాధలు, సమస్యలు ఉద్యోగుల బాగోగులు, హాస్టల్ విద్యార్థుల ఫీజులకు నిధులు విడుదల చేయని జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉనికి కోసమే యువత పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నాడన్నారు. యువతను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకొచ్చేందుకు జగన్ పిచ్చి పనులు చేస్తున్నాడని, జగన్ హయాంలో నిరుద్యోగం పెంచి ఇప్పుడు ఆపోరు ఈపోరు అంటూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చే ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్ మాట తప్పానని మొదటగా రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాల్సిన అవసరం వుందన్నారు. జగన్ అధికారంలో వుండగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 4,200 కోట్లకు పైగా బకాయిలు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి నారా లోకేష్ చొరవతో ఇప్పటికే 800 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు.

చంద్రయ్య హత్యపై సీఐడి విచారణ హర్షణీయం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తోట చంద్రయ్య హత్యపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తోట చంద్రయ్య రెండెకరాల రైతు అని, తెలుగుదేశం పార్టీపై అభిమానం, అన్న ఎన్టీఆర్ పట్ల మమకారంతో పనిచేసే వాడని, అటువంటి చంద్రయ్యను ముక్కోటి ఏకాదశి రోజున పట్ట పగలు అందరూ చూస్తుండగా గ్రామంలోని నడి రోడ్డుపై అత్యంత పాశావికంగా గొంతు కోసి హతమార్చారని స్పీకరు రఘురామకృష్ణరాజు దృష్టికి తెచ్చారు. జై జగన్ అంటే చంపకుండా వదిలిపెడతామని ప్రత్యర్థులు బెదిరించినా జైచంద్రబాబు అంటూ ప్రాణాలు విడిచిన కార్యకర్త అని తెలిపారు. వైసీపీ పరిపాలన చంబల్‌లోయను మించి తాలిబన్ రాజ్యంను తలపించిందన్నారు. అప్పట్లో పల్నాడులో బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఫిర్యాది ముద్దాయి అవుతాడు.. ముద్దాయి ఫిర్యాదిదారు అవుతారని ఇంతకంటే దౌర్భాగ్యం రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలో మరెక్కడా ఉండదన్నారు. తనకు మొట్టమొదటిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు స్పీకరు రఘురామకృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జిందాల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 6 గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు 6.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారన్నారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె. చాందిని, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థి ఎమ్. వివేక్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు గుంటి పీటర్ పాల్, ఎమ్. అజయ్ శ్రీకృష్ణ, వర్ధన కె, వై. శ్యామ్ కుమార్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ .కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ .కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీకు చెందిన 6వ సంవత్సరం విద్యార్థులు ఎస్‌కే. దెహనాజ్, ముషీర అనే ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో 4 వారాల అడ్వాన్స్డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలియజేసారు. టెన్నెస్సెలోని నాష్‌విల్లేలో అమెరికన్ ఫార్మా సిస్టం అసోసియేషన్ ఆన్యుల్ కన్వెషన్, ఓహియోలోని యూ నివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న ఫార్మాడీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో రెండు రీసెర్చ్ పేపర్లు ప్రచురించ డానికి వీరికి అనుమతి లభిం చిందని వెల్లడించారు. విద్యా ర్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,44,323 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,38,953 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,44,323 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,551 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నంబరు. 5	10000	14000
273	10000	13000
341	10500	14500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11000	12500
బ్యాడిగి 355	10000	14000
సింజెంటా బ్యాడిగి 5531	10500	12200
దేవనూరు డీలక్స్	11500	13500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	7500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

18 అక్రమ కట్టడాలపై ఛార్జ్‌షీట్ దాఖలు

● టీపీవో ఎస్.మల్లికార్జునరావు



బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని 18 అక్రమ కట్టడాలపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు టీపీవో ఎస్.మల్లికార్జునరావు తెలిపారు.



ప్రశ్న: అక్రమ కట్టడాలపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారు?

టీపీవో : పట్టణంలో 18 అక్రమ కట్టడాలు గుర్తించి వాటిపై కోర్టులో ఛార్జ్‌షీట్‌లు వేశాం. ఫైలింగ్ కూడా అయ్యింది.

ప్రశ్న: ఎన్ని నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు?

టీపీవో : 30 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. అవసరమైతే మరి కొన్నింటిపై ఛార్జ్‌షీట్ చేసే అవకాశం ఉంది.

ప్రశ్న: డ్రైనేజిని అక్రమించి నిర్మించిన నిర్మాణాలపై చర్యలేమిటి?

టీపీవో : ఇప్పటికే సూర్యలంక రోడ్డులో డ్రైనేజిని అక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలిగించాం. మిగిలిన ప్రాంతాలలో కూడా తొలిగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నూతన నిర్మాణాలకు అనుమతులు ఏవిధంగా ఇస్తున్నారు?

టీపీవో : ఓల్డ్ బిల్డప్ ఏరియాలో 10 మీటర్ల ఎత్తు వరకు నిర్మించే కట్టడాలకు ఎల్‌టీపీలు ద్వారా, న్యూ డెవలప్‌మెంట్ ఏరియాలో టౌన్‌ప్లానింగ్ ద్వారా అనుమతులిచ్చే విధంగా కొత్త జీవో ఉంది.

లీజు లైసెన్స్‌ల హక్కుల వేలం వాయిదా

పిట్టలవానిపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం బాపట్ల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన లీజు లైసెన్స్‌లకు సంబంధించి హక్కుల బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం 21 మంది పాల్గొన్నారు. 11 మంది డిపాజిట్‌లు చెల్లించిన వారిలో వివిధ కారణాలు వల్ల ఈ వేలం పాటకు ముందుకు రాలేదని జి.నరసింహమూర్తి పాల్గొన్నారు. ఈ వేలం పాటను తిరిగి ఈనెల 19వ తేదీకి వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చలేని వైసీపీ ఉద్యమాలు చేయటమా : కొల్లా

బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై గుంతలు పూడ్చలేని వైసీపీ వారు ఉద్యమాలు చేయటం ఏమిటని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కూటమి పాలనపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందంటూ అంబటి అవాకులు, చెవాకులు పేలటం సిగ్గుచేటు అన్నారు. 5 సంవత్సరాల పాలనలో లక్షల కోట్లు అప్పులు తెచ్చి కనీసం రోడ్లు కూడా వేయలేని అసమర్థ వైసీపీ నాయకులు ఏముఖం పెట్టుకొని రోడ్లపై పోరాటాలు చేస్తారని ప్రశ్నించారు.

పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ

బాపట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమ్ములపాలెం, పట్టణంలోని డంపింగ్ యార్డు పరిసరాలలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాల వారికి జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం భోజన ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. సొసైటీ యూత్ సహకారంతో అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ ఆహార ప్యాకెట్‌లను పంపిణీ చేసి పేదలకు సేవ చేసేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపూరి జోసఫ్, జయపాల్, దాసరి ఏసుబాబు, కె.సుజాత, కట్టా శ్యామల, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం : టీఎన్ఎస్ఎఫ్

బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : పోరుబాట పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు మొవ్వా శరత్ చంద్ర అన్నారు. వైసీపీ చేపట్టే యువత పోరుబాటను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రద్దు చేసి విద్యాదీవెన, వసతిదీవెన పేరుతో మోసం చేశారన్నారు. నాడు విద్యార్థుల జీవితాలతో ఆడుకొని ఇప్పుడు న్యాయం చేయమని పిలుపునివ్వటం హాస్యాస్పదమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. వైసీపీ స్వార్థ రాజకీయాలకు విద్యార్థులు బలికావొద్దు అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాంబాబు, తెలుగు యువత నాయకులు పరిశా గోపి, బోరుగడ్డ ఆనంద్, తుమాటి రత్నపాల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో గ్రామీణ అంచనా కార్యక్రమం

కర్లపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లైబ్రరీ వద్ద కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామపటం, వనరులు, రైతుల ఇబ్బందులు, మ్యాట్రిక్‌చెట్టు ద్వారా రైతులకు విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఉషా, కోఆర్డినేటర్ మురళీధర్‌నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు భ్రమరాంబిక, మొయిస్, సుదేవ్, ఉమ, హరిబాబు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ విభాగానికి ఇన్‌చార్జి పీడీగా కె.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఈడీగా పని చేస్తున్న ఆయనను నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ ఏపీడీగా నియమించిన ప్రభుత్వం, అదే విభాగానికి బాపట్ల జిల్లా పీడీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రేపల్లె డీఎల్‌డీవోగా ఉన్న పద్మ ప్రస్తుతం డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా వ్యవహరిస్తున్నారు. తాజా ఆదేశాల నేపథ్యంలో ఆ బాధ్యతలను శ్రీనివాసరావు చేపట్టనున్నారు



పి4సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, కమిషనర్ జి.రఘునాధరెడ్డి

సర్వేకు ప్రజలు సహకరించాలి : ఆర్డీవో

బాపట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పి4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఆర్డీవో పి.గ్లోరియా కోరారు. పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. సర్వేచేసే సిబ్బంది అడిగే సమాచారాన్ని తెలియజేయాలని ఆప్రాంతవాసులకు తెలియజేశారు. త్వరితగతిన సర్వేను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పైపులైన్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి : కమిషనర్

బాపట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బెస్తపాలెం వేదాంతంవారి వీధి దగ్గర జీబీసీరోడ్డు పక్కనే తాగునీటి పైపులైన్‌కు లీకేజి ఏర్పడింది. లీకేజి పనులను మంగళవారం కమిషనర్ జి.రఘునాధరెడ్డి పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ జి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించి పూడికలు తొలిగించాలన్నారు. అంతర్గత రోడ్లను శుభ్రం చేయాలన్నారు. రోడ్డు మార్జిన్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలిగించాలన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉన్నందున ఫాగింగ్ నిర్వహించాలన్నారు.

పన్నులు వసూళ్ళు చేయాలి

పట్టణంలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, నీటికుళాయిల పన్నులు వసూళ్ళు చేయాలని కమిషనర్ జి.రఘునాధరెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పన్ను విషయమై మంగళవారం రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్‌తో కలిసి సిబ్బందితో సమీక్షించారు. పన్నువసూళ్ళ విషయంలో ఆలసత్వం వద్దని చెప్పారు. మొండిబకాయిలను గుర్తించి వాటి వసూళ్ళ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ డి.లలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తమ గోడు వినిపించాలనుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధించి వారి ఆందోళనను అణచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు నిదర్శనమన్నారు. కార్యకర్తల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని, ప్రభుత్వం వెంటనే వారితో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అదనపు సమ్మర్ స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు చేయాలి

● అసెంబ్లీలో వివరించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా 100 ఎకరాలలో మరొక సమ్మర్ స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శాసన సభ సమావేశాలలో మంగళవారం వివరించారు. 1980లో 25వేల పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకొని సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం లక్షా 20 వేల జనాభాతో జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల పట్టణంలో అదనపు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వ్యక్తికి 135 లీటర్లు నీటిని అందించాల్సి ఉందన్నారు. అయితే తాము 60 లీటర్లు మాత్రమే అందిస్తున్నామని చెప్పారు. వేసవిలో రోజుమార్చి రోజు తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఉన్న ట్యాంక్ పక్కనే భూమిని సేకరించి మరొక ట్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నరేంద్రవర్మ వివరించారు. సమస్యపై ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించి అదనపు ట్యాంక్ ఏర్పాటుపై ప్రకటన చేసి ఉన్నారని గుర్తు చేశారు. బాపట్లకు మరొక ట్యాంక్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

● ఫుడ్ సేఫ్టి ట్రైనర్ కె.ప్రవీణ్‌కుమార్

బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టి ట్రైనర్ కె.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ఆహార భద్రత శిక్షణా కార్యాలయంలో మంగళవారం హోటల్ వ్యాపారులకు ఆహార భద్రతపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుం విధించటం జరుగుతుందన్నారు. ఫుడ్ సేఫ్టి జిల్లా అధికారి దేవరాజు మాట్లాడుతూ కల్తీ ఆహారం ద్వారా ఏ వ్యక్తికైన ప్రాణహాని జరిగితే రూ.10 లక్షల జరిమాన విధించటం జరుగుతుందన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టి ఆఫీసర్ ప్రణీత్ మాట్లాడుతూ ఆహార పదార్థాల అమ్మకాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జాతీయ కన్స్యూమర్ ఫెడరేషన్ వైస్‌ప్రెసిడెంట్ చదలవాడ హరిబాబు, నవీన్, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు బీసీ కులవృత్తుల మండల స్థాయి సమావేశం

చుండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామాల్లోని బీసీ కులవృత్తుల వారికి ఆదరణ పథకం ద్వారా సరైన పనిముట్లు ఎంపిక చేసుకోవడానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎన్.సుదీప మంగళవారం తెలిపారు. బీసీ కుల వృత్తిదారులు సరైన గుర్తింపు పత్రాలు అందించవలసినదిగా ఆమె కోరారు.



సభలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల విస్తరణావిభాగం అధిపతి డాక్టర్ సురేష్‌కుమార్

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

● వ్యవసాయ కళాశాల విస్తరణావిభాగం అధిపతి డాక్టర్ సురేష్‌కుమార్

బాపట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని వ్యవసాయ కళాశాల విస్తరణావిభాగం అధిపతి డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో విస్తరణా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సమయ నియంత్రణ, ప్రొఫెషనల్ ఎథిక్స్ వంటి అంశాలపై విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవటం, స్కిల్స్ అభివృద్ధి చేసుకోవటం, కెరీర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం వంటి అంశాలపై దృష్టిసారించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కుమార్, ఫోరం సభ్యులు కె.రవిబాబు, జి.వెంకటేశ్వర్లు, హేతువాద సంఘ కార్యదర్శి మేడూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం అగ్నిహోత్రం మారుతి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి అనువంశిక అర్చకస్వాములైన వేదాంతం నరసింహచార్యులు, వేదాంతం జగన్నాధచార్యులు, వేదాంతం రామానుజచార్యులు వంశీకులచే స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఆలయానికి విద్యుత్ అలంకరణగావించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం పంచగవ్యప్రాశసన, వాస్తు కార్యక్రమాలు, రాత్రి 7 గంటలు నుంచి అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, బలిహారం, రాత్రి 7.30 గంటలకు శ్రీహరిహర భక్తసమాజం, ఖాజీపాలెం వారిచే భజన కాలక్షేపాలను నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులందరికి పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవిరాజుపాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని సమ్మెటవారిపాలెం మంచినీటి చెరువును పరిశీలించి తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులతో సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందుగానే అప్రమత్తమై తాగునీటి చెరువులన్నింటిని నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంబాబు, ఏఈ బాషా, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అధికారులందరూ కలిసి సమ్మెటవారిపాలెం తాగునీటి చెరువును పరిశీలించారు.



సమ్మెటవారిపాలెం తాగునీటి చెరువును పరిశీలిస్తున్న డీఈ రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు

యువతపోరును విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : యువత పోరును విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. పార్టీశ్రేణులతో కలిసి మంగళవారం ఆయన యువత పోరుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రఘుపతి మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు వైసీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయన్నారు. 11గంటలకు పార్టీశ్రేణులంతా కలిసి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్ళివినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య సహిత్, జోగి రాజా, లీలా శ్రీనివాసరెడ్డి, పీటా వెంకటేశ్వరరావు, చక్రపాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బాపట్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు రామచంద్రయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యానాదుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవన విధానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు మాట్లాడుతూ పిల్లలను బాగా చదివిస్తే వారి జీవితాలలో వెలుగులు నిండుతాయన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాపట్ల శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జంపని అనీల్‌కుమార్, సభ్యులుగా పొట్లూరి సాయి, కొమరగిరి సంగీతరావు, రాజగిరి శ్రీనివాస్, నాగేంద్రమ్మ, రావూరి పద్మ, పొట్లూరి గురవయ్య, బాపట్ల కోటయ్య, కొమరగిరి వంశీ, చందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బొజ్జా రాకేష్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేవూరి తులసీరాం, రమేష్, పొలయ్య పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు : ఎంపీడీవో

కొల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బీసీ కులాలు, ఈడబ్ల్యూఎస్ కులాలకు రాయితీ రుణాలు అందిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు మంగళవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు, మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం మండలానికి 105 కుట్టుమిషన్లు ప్రభుత్వం కేటాయించిందని, దరఖాస్తు చేసుకున్న మహిళలకు మూడు నెలలు శిక్షణ అనంతరం వాటిని ఉచితంగా అందించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. బీసీ-ఏ 6, బీసీ-బి 7, బీసీ-డి 3, బీసీ-ఈ 2 మొత్తం 18, కాపు మహిళలకు 26, ఈడబ్ల్యూఎస్ 61 మొత్తం 105 మంది మహిళలకు ఉచిత శిక్షణ తర్వాత కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు లింకు రాయితీ రుణాలు బీసీలకు 15, ఈడబ్ల్యూఎస్ కులాలు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల లబ్ధిదారులకు 8, జనరిక్ మెడికల్ కింద మరో రెండు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా రుణాలకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 10 నుంచి 22వ తేదీ వరకు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లు : ఎంపీడీవో

చుండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీసీ, ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాల మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడానికి ప్రభుత్వం కుట్టు శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్ అందిస్తుందని ఎంపీడీవో ఎన్.సుదీప మంగళవారం తెలిపారు. లబ్ధిపొందవలసిన వారు 18-45 సంవత్సరాలు వయసు లోపు మహిళలై ఉండాలి. వారు ప్రభుత్వం ఇచ్చే 90 రోజులు శిక్షణలో తర్ఫీదు పొందాలని, ఆసక్తి గలవారు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తులు అందించాలని ఆమె కోరారు.

డ్వాక్రా మహిళలు రుణాలు సకాలంలో చెల్లించాలి : డీపీఎం

కర్లపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకుంటూ పొదుపులు, అప్పులు సకాలంలో చెల్లించాలని బాపట్ల ఏరియా కోఆర్డినేటర్, డీపీఎం ఉసరపాటి సుబ్బారావు అన్నారు. కర్లపాలెంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ధనలక్ష్మి అధ్యక్షతన ఏపీఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కుటుంబంలో ఒకరిని పారిశ్రామిక వేత్తగా తయారు చేసే దిశగా పని చేస్తున్నాయని ఏపీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు యు.నాగలక్ష్మి, ఎ.శివలీల, సీసీలు సీహెచ్ రాఘవులు, కె.శివకోటేశ్వరరావు, ఆర్.శివప్రభ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోలాయపాలెం 'పొలం పిలుస్తోంది'

కర్లపాలెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ తరుపున సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు ఈ నెలాఖరు లోపల తప్పనిసరిగా రైతు గుర్తింపు సంఖ్య పొందాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి అన్నారు. మండలంలోని బోలాయపాలెంలో మంగళవారం ఏవో సుమంత్‌కుమార్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ పెసర క్వింటా రూ.8,682, మినుము క్వింటా రూ.7,400 ధరలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం 12 శాతం తేమ ఉండాలని, ఇతర వ్యర్థాలు రెండు శాతం మించి ఉండకూడదని, ఇరిగిన, రంగుమారిన గింజలు మూడు శాతం లోపల ఉండాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, సహాయకులు కల్యాణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భవనవారిపాలెం, పిట్టువారిపాలెంలో...

పిట్టలవానిపాలెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండలంలోని భవనవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాలలోని రైతు సేవాకేంద్రాలలో నిర్వహించారు. ఆయన ఆయా రైతు సేవాకేంద్రాల పరిధిలోని రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు రెండో పంటగా వేసుకున్న మినుము, పెసర కోతకు వచ్చి ఉన్నాయని వారికి పలు సూచనలు చేశారు. ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలోని ఏఈఓలు పావని, సీహెచ్ సుదర్శనరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించేందుకే పోటీ పరీక్షలు

నగరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు లాజర్, వీరాంజనేయులు అన్నారు. పూడివాడలోని పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిభా పరీక్షకు హాజరైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో నిలబడేందుకు విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ముందుకు సాగాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నా, పాఠశాల విశ్రాంతి ఉపాధ్యాయులు యల్లాప్రగడ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

అమృతలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. అమృతలూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. తమ ఆర్థిక పరిస్థితి గురించి ఎమ్మెల్యేకు వివరించి సాయం అందించాలని కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి అందిన చెక్కులు అమృతలూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి కమల రూ.1,21,329, జాన్సి అఖిల రూ.31,278, సుంకర సౌజన్య రూ.30 వేలు, మల్లెల బాబురావు రూ.27,583, కూచిపూడి గ్రామానికి చెందిన జంపని నాంచారమ్మ రూ.39,500, గోళ్ల వెంకటేశ్వరరావు రూ.30,028, బెల్లం వెంకటేశ్వరరావు రూ.88,454, కోడితాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు రూ.25,000 వెరశి మొత్తం రూ.3,93,172లను బాధిత కుటుంబ సభ్యులకు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యలవర్తి బ్రహ్మనందం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

రేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సురవరపు సోమయాజులు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉండటంతో ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిశారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.14,51,610 సోమయాజులుకు మంజూరు చేయించారు. ఈ చెక్కును సోమయాజులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బాధితుడికి సీఎంఆర్ఐ చెక్కును అందిస్తున్న అనగాని శివప్రసాద్

పది పరీక్షలకు 1924 మంది విద్యార్థులు

● నియోజకవర్గంలో 15 పరీక్ష కేంద్రాలు

వేమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 42 పాఠశాలల ద్వారా 1924 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. 29 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 13 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకానుండగా వారిలో 989 మంది బాలురు, 935 మంది బాలికలు ఉన్నారు. వేమూరు మండలంలో 225 మంది విద్యార్థులు ఉండగా, వేమూరు, పెరవలి పరీక్ష కేంద్రాలతో పాటు కొల్లూరు మండలం అనంతవరం పరీక్ష కేంద్రానికి హాజరుకానున్నారు. కొల్లూరు మండల పరిధిలో అనంతవరం, కొల్లూరులోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల ద్వారా 424 మంది పరీక్షలు రాయనున్నారు. భట్టిప్రోలు మండల పరిధిలో 605 మంది విద్యార్థులు ఉండగా వారంతా పల్లెకోన, పెదపులివర్రు, ఐలవరం, భట్టిప్రోలు, వెల్లటూరు పరీక్ష కేంద్రాలకు హాజరుకానున్నారు. చుండూరు మండలంలో 363 మంది విద్యార్థులు ఉండగా వారంతా యడ్లపల్లి, చుండూరు, మోదుకూరు పరీక్ష కేంద్రాలకు హాజరుకానున్నారు. అమృతలూరు మండలంలో 307 మంది విద్యార్థులు అమృతలూరు కూచిపూడి పరీక్ష కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంతవరకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించడంతో పాటు ప్రీ పబ్లిక్ పరీక్షలను పూర్తి చేసుకుని చివరిగా గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నారు.



గ్రాండ్ టెస్ట్ పరీక్షలు రాస్తున్న పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు

రైతులు సీఎం యాప్‌లో వివరాలను పొందుపర్చుకోవాలి

రేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఈక్రాప్ నమోదైన అందరూ మీ గ్రామ వ్యవసాయ సంచాలకులు రైతు సేవాకేంద్రం వద్ద కలసి సీఎం యాప్‌లో మీ వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ ఆర్.విజయబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ పంటలో పండించిన పంటలకు ప్రభుత్వం ఈ విధంగా ధరలను కేటాయించటం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెసలు కనీస మద్దతు ఒక్కొక్క క్వింటాకు రూ.8,682, మినుములు క్వింటాకు రూ.7,400, శనగలు క్వింటాకు రూ.5,650 మద్దతు ధరగా ప్రకటించిందని తెలిపారు. రైతుల బ్యాంకు అకౌంట్ ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకుని ఉండాలని, ఆధార్‌కార్డుతో పాటు ఫోన్‌నెంబర్ అందించాలని సూచించారు. రైతుల కొనుగోలు కేంద్రం వద్ద మద్దతు ధర పొందేందుకు ఎటువంటి ఖర్చులు కొనుగోలు కేంద్రం సిబ్బంది చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఇంటి పన్నును సత్వరమే వసూలు చేయాలి

రేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటిపన్నును ఆయా టార్గెట్ల ప్రకారం సెక్రటరీలు త్వరితగతిన వసూలు చేయాలని డీఎల్‌పీవో కేజీఏ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర చెత్తసేకరణ ఇంటి పన్నులపై పంచాయతీ సెక్రటరీలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం గ్రామాల్లో ఇంటిపన్ను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా ఎప్పటికప్పుడు గ్రామాల్లో చెత్తను సేకరించి అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేతిపంపులను వేసి తాగునీరు అందేలా కృషి చేయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పీపీడీవీ ప్రసాద్‌బాబు, సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

సఖి నివాస్ సిద్ధం



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, ఫైర్ సేఫ్టీ సిలిండర్



కిచెన్ రూమ్



సఖి నివాస్..

- నిరీక్షణకు ఎట్టకేలకు తెర
- గత టీడీపీ ప్రభుత్వంలో మొదలైన పనులు
- ఎన్నికల నాటికి తుది దశకు చేరిన వైనం
- వైసీపీ రాకతో భవనానికి గ్రహణం
- కూటమి ప్రభుత్వం రాకతో జీవం..
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



డార్మెటరీ గదిలో పడకలు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పని చేసుకునే మహిళలు, చదువుకునే విద్యార్థినులకు భద్రతతో కూడిన ఆశ్రయాన్ని కల్పించే 'సఖి నివాస్' భవనానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ సఖి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ సఖి నివాస్ మహిళలు, విద్యార్థినులకు అందుబాటులోకి రావడానికి దాదాపు ఏడేళ్ల సమయం పట్టింది. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే.

2019 నాటికే తుది దశకు నిర్మాణం

నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి పొందే మహిళలకు చౌకగా భద్రతతో కూడిన ఆశ్రయం కల్పించడంలో భాగంగా కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 'సఖి నివాస్'లను ఏర్పాటు చేయడానికి పూనుకుంది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కావడంతో కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం వాటాలతో సఖి భవనాలను నిర్మిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ హాస్టళ్లను నిర్మించి మహిళలకు అందుబాటులోకి తేవాలని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ క్రమంలో గుంటూరు జిల్లాలో దాదాపు రెండున్నర కోట్ల వ్యయంతో మహిళా ప్రాంగణంలో ఈ హాస్టల్‌ను నిర్మించేందుకు పూనుకున్నారు. 2019 నాటికి నిర్మాణం తుది దశకు చేరింది. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిం ది. హాస్టల్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వచ్చినా, మౌలిక సదుపాయాలు కల్పించి దాన్ని వినియోగంలోకి తేవడానికి గత ప్రభుత్వానికి మనసు రాలేదు. దీంతో ఐదేళ్లపాటు ఆలన, పాలన లేకుండా నిర్మాణం పడి ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొరవ పనులు పూర్తి చేశారు. త్వరలో హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

● 90 మందికి ఆశ్రయం

ఉద్యోగినులు, పని చేసుకునే మహిళలు, విద్యార్థినులకు 24 గంటలపాటు భద్రత కల్పించే విధంగా హాస్టల్‌ను నిర్మించారు. మొత్తం 4 డార్మెటరీల్లో 90 మందికి ఆశ్రయం కల్పించే అవకాశం ఉండగా, తొలి విడతగా 50 మందికి నివాస ఏర్పాట్లు చేశారు. సింగిల్, డబుల్, ఐదుగురు సభ్యుల బెడ్‌రూమ్‌తోపాటు డార్మెటరీలు అందుబాటులో ఉన్నాయి. కేటగిరీ- 1 డార్మెటరీలో నాన్ ఏసీ గదులకు నెలకు రూ. 1200, ఏసీ గదులకు రూ.1,800, కేటగిరీ- 2 ఫైవ్ షేరింగ్ గదుల్లో నాన్ ఏసీ గదికి రూ.1,800, ఏసీ గదికి రూ.2,500 అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ అద్దెలు నిర్ణయించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఆ బెడ్ రూములు బుక్ అయిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా భోజనానికి సంబంధించి డ్వాక్రా గ్రూపులకు బాధ్యతలు అప్పగించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

సదుపాయాలు..

- విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంటర్నెట్, వైఫై సదుపాయాన్ని కల్పిస్తున్నారు.
- 24 గంటల నీటి సదుపాయం అందుబాటులో ఉంటుంది. తాగునీటి కోసం ప్రత్యేకంగా ఆర్వోమిషన్ ఏర్పాటు చేశారు.
- స్నానం చేసేందుకు వేడినీళ్ల సదుపాయం ఉంది. దుస్తులు ఉతుక్కోవడానికి వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు.
- రక్షణ కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.
- వ్యాహ్యాళి (రిక్రియేషన్) కోసం టీవీ ఏర్పాటు చేశారు. చదువుకునేందుకు, స్వయం ఉపాధి పనులు చేసుకునేవారికి ప్రత్యేకంగా ఒక హాల్ ఏర్పాటు చేస్తున్నారు.

రిక్రియేషన్ రూమ్



డైనింగ్ హాల్



అవకతవకలపై.. అలసత్వం

(5వ పేజీ తరువాయి)

అద్దెకిచ్చిన దాఖలాలే లేవు. ఇలా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయడంలో గోప్యత పాటించడంతో పాటు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంలోనూ వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇష్టారీతిన వైసీపీ తన అనుయాయులకు దోచిపెట్టినా వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ యంత్రాల యూనిట్ల విషయంలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదు. సదరు యూనిట్ల కోసం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పటి ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

రైతులకు వ్యక్తిగతంగా రాయితీ యంత్రాలను 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చింది. గ్రూపులకు యంత్రపరికరాల యూనిట్లు ఇచ్చేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే రాయితీ పరికరాల జాబితా ట్రాక్టర్ లేకపోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దానిని తిరిగి చేర్చారు. ఆ తర్వాత రాయితీ విషయంలో అస్పష్టత, యంత్రాలను అందించే కంపెనీల ఎంపికలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి 15 లక్షల యంత్రాలను అందించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం ప్రభుత్వమే రాయితీ ఇవ్వగా, మిగిలిన పది శాతం ఆయా గ్రూపు సభ్యులే భరించాలి. సదరు యూనిట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచి అవసరమైన రైతులకు నామమాత్రపు అద్దెకు ఇవ్వాలి. ఇందుకు ఎంతమంది రైతులు వాటిని వాడుకున్నారనే అంశంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు కూడా నిర్వహించాలి. వసూలు చేసిన అద్దె విషయంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలన్నది నిబంధన విధించారు. మొత్తమ్మీద ప్రతిదశలోనూ అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం నడిపింది. చివరకు బాపట్ల జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాల పరిధిలో 270 చోట్ల మాత్రమే యూనిట్లను మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో 249కు 205 చోట్ల, పల్నాడు జిల్లాలో 421 కేంద్రాలకు 290 కేంద్రాల్లో రాయితీపై యంత్రపరికరాల యూనిట్లకు పంపిణీ చేసింది. అయితే ఆయా యూనిట్లలో దాదాపు సగం చోట్ల ట్రాక్టర్లు లేకుండానే మమ అనిపించారు. కనీసం వీటి ఎంపిక అయినా పారదర్శకంగా జరిగిందంటే దాదాపు 50 శాతం యూనిట్లు సేద్యంతో ఏ మాత్రం సంబంధం లేని వైసీపీ నేతల అనుచరగణం వద్దనే ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల వద్దే పరికరాలను ఉంచాలనే నిబంధనకు పాతరేసి సొంత ఆస్తిలాగా తమ ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులకు యంత్రాల అవసరమొస్తే వారి ఇళ్ల ముందు పడిగాపులు కాసే పరిస్థితి తీసుకొచ్చారు. రైతులపై కూడా పార్టీ ముద్ర వేసి రాయితీ యంత్రాల ఫలాలకు దూరం చేశారు.

గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్‌ని

ఆదాయవనరుగా మార్చుకోవాలి

● గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ



రైల్వే వారోత్సవంలో షీల్డ్‌ని ప్రదానం చేస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంటూరు రైల్వే డివిజన్ పరిధి తగ్గిపోతున్నది. ఈ నేపథ్యంలో లోడింగ్, ఆదాయంలో ఏర్పడబోయే లోటుని గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్ ద్వారా పూడ్చుకోవాల్సి ఉందని రైల్వే గుంటూరు డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ అన్నారు. ఆ రీజియన్‌లో ఆదాయ వనరుగా మార్చుకోవాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో 69వ రైల్వే వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ చెట్టినాడు సిమెంట్స్, శ్రీ సిమెంట్స్ సైడింగ్‌ల ద్వారా లోడింగ్‌లు పెంచుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం రైల్వే ఉద్యోగులంతా కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం జనరల్ మేనేజర్ స్థాయిలో మూడు అవార్డులు, రైల్వే బోర్డు స్థాయిలో ఒక అవార్డును సాధిం చినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అవార్డులు పొందిన వారిలో వీ అలివేలు మంగమ్మబాయి(అకౌంట్స్), పీ శ్రీనివాస్, టీ బ్రహ్మ రెడ్డి, ఎం రాహుల్(సివిల్ ఇంజనీరింగ్), వేజండ్ల సరిత (కమర్షియల్), ఎస్ సోమునాయుడు(ఎలక్ట్రికల్ టీఆర్‌డీ), జీ రత్నం(ఎలక్ట్రికల్ మెయిన్‌టెనెన్స్), ఏ శ్రీనివాసరావు, బీమవరపు సాయిరాం(మెకానికల్), నంబూరి వెంకటేశ్వర రావు (మెడికల్), చిరబోయిన శ్రీనాథ్, లింగాబత్తుని సోనిబాబు (ఆపరేటింగ్), రెడ్డి శ్రీనివాసు(పర్సనల్), బోను వెంకటరమణ(సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే సైమన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీ వీ రమణయ్య, సీనియర్ అధికారులు జేవీ అనూష, షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీడీల విధానంలోనే ప్రశ్నపత్రాలు

సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు వెల్లడి

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టటానికి సీడీల విధానంలో ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు అందించే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామని పీజీ ప్రొఫెషనల్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రతిరోజు పరీక్ష ప్రారంభానికి అరగం ట ముందు పాస్వర్డ్‌ను పరీక్షా కేంద్రాల చీఫ్‌లకు పంపటం జరిగిందని చెప్పారు. పాస్వర్డ్ అందిన వెంటనే అబ్జర్వర్ల సమక్షంలో సీడీలను ఓపెన్ చేసి ప్రశ్నపత్రాలను ప్రింట్ తీయాల్సిందిగా పరీక్షల ప్రారంభానికి కొన్ని రోజులు ముందుగానే (సీడీలు అందచేసిన సమయంలోనే) పరీక్ష కేంద్రాల చీఫ్ లకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ప్రశ్నపత్రాల ముద్రణ ఖర్చు తగ్గించుకోవాలనే దురుద్దేశంతో అనాలోచితంగా సీడీల విధానం తెచ్చారన టంలో వాస్తవం లేదని,అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగిం చుకొని బీఈడీ పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు సీడీలు విధానం తెచ్చామని ఆయన చెప్పారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్

చర్లపల్లి నుంచే లింగంపల్లికి బైపాసు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం లింగంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్, గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25వ తేదీ నుంచి చర్లపల్లి నుంచి లింగంపల్లికి బైపాసు కానుంది. ఈ మేరకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లికి సాయంత్రం 6.05కి చేరుకొని 6.10కి బయలుదేరి బైపాసు మార్గంలో ప్రయాణించి నేరుగా రాత్రి 7.40కి లింగంపల్లి చేరుకొంటుంది. నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26వ తేదీ నుంచి లింగంపల్లిలో ఉదయం 6.15కు బయలుదేరి బైపాసు మార్గంలో 7.15కి చర్లపల్లికి చేరుకొని రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది. ఈ రైలుకు సికింద్రాబాద్, బేగంపేట నిలుపుదలను ఎత్తేశారు. అలానే నంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి, నంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లు కూడా సికింద్రాబాద్, బేగంపేట మార్గంలో కాకుండా చర్లపల్లి నుంచి నేరుగా లింగంపల్లికి చేరుకొంటాయి. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని రైల్వేబోర్డు విజ్ఞప్తి చేసింది.

నెలాఖరు వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ అనంతపురం వరకే..

ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం పనుల నిమిత్తం నంబరు. 17215 మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 12 నుంచి 30వ తేదీ వరకు అనంతపురం వరకే నడపడం జరుగుతుందని డీఆర్‌ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా నంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయలుదేరి గుంటూరు మీదగా మచిలీపట్నం చేరుకొంటుందన్నారు. ఈ సవరణలను ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రోన్లతో జూదరుల ఆటకట్టు

● పేకాట శిబిరాలపై పోలీసుల సాంకేతిక దాడి ● అదుపులో పదిమంది.. 10 వేల నగదు స్వాధీనం



డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించిన పేకాట శిబిరం



పేకాట శిబిరం వద్ద ఎగురుతున్న డ్రోన్ కెమెరా



డ్రోన్ కెమెరాను గుర్తించి పరుగులు తీస్తున్న జూదరులు

చుండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేకాట సమాచారం అందినా పోలీసులు అక్కడకు వెళ్లే సరికి వారు పారిపోతుం టారు. జూదరుల నెట్‌వర్క్ ముందు పోలీసుల శ్రమ వృథా అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా జూదరుల ఆట కట్టించాలనుకున్న చుండూరు పోలీసులు అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికతను వినియోగిస్తున్నారు. డ్రోన్ కెమెరాల ను వినియోగించి జూద శిబిరాలను గుర్తించి అందిపుచ్చు కుంటోన్న జూదరుల ఆటకట్టిస్తోంది. మండల పరిధిలోని యడ్లపల్లి, దుండిపాలెంలోని నిమ్మతోటల్లోని పేకాట శిబిరాలు విస్తృతంగా ఉన్నాయి. పేకాట గురించి తెలిసినా పోలీసులు తోటల్లోకి బైక్‌లపై వెళ్లే అవకాశం లేదు. నడిచి వెళ్లాలంటే 40 నిమిషాలు సమయం పడుతుంది. కొత్త వారి కదలికలపై ప్రత్యేకంగా నిఘాకు మనుషులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎన్ని సార్లు దాడులు చేసినా పోలీసులకు జూదరులు దొరికేవారు కాదు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ఎస్పీ తుషార్‌డూడీ ఏర్పాటు చేసిన ప్రత్యేక టీమ్, చుండూరు పోలీసులు కలిసికట్టుగా మంగళ వారం యడ్లపల్లి నిమ్మతోటల్లోని జూద శిబిరాలను డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి పేకాడుతున్న 20 మందిని గుర్తించారు. ఇంతలో డ్రోన్ కెమెరాను గుర్తించిన జూదరులు పారిపోయేందుకు ప్రయత్నించగా అప్పటికే చుట్టుముట్టిన పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రహిమాన్ తెలిపారు.



ఉదయం హంస వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు

హంస, గజ వాహనాలపై శ్రీవారి గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి మంగళవారం రెండు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హంస వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పాలను, నీటిని వేరు చేసే స్వచ్ఛమైన పాలనుగ్రోలు హంస వలె భక్తుల పాపాలను వేరుచేసి పుణ్యాత్ములుగా చేసేందుకు శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని అర్చకస్వాములు వివరించారు. ఈ ఉత్సవానికి వేదాంత వెంకట రమణాచార్యులు జ్ఞాపకార్థం భార్య గోపాల సత్యవతి, కుమారుడు వేణుగోపాల వాసుదేవ భట్టర్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. సాయంకాలం స్వామి గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. గజ వాహన ఉత్సవాన్ని దర్శించిన యెడల మొసలి బారి నుంచి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధంగా సంసారమనే మొసలి బారి నుంచి తన భక్తులను కాపాడి రక్షించి ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవానికి పాతమంగళగిరి పద్మశాలీయ సంఘం వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



రైల్వే డివిజన్ మెంబర్ రాజేష్‌ను సత్కరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

చీరాల రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆపాలి

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ విశేషంగా రాకపోకలు సాగిస్తున్న చీరాల రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆగే విధంగా కృషి చేయాలని పలువురు టీడీపీ కూటమి నాయకులు రాజేష్‌ను కోరారు. బాపట్లకు చెందిన పఠాన్ రాజేష్ ఇటీవల గుం టూరు రైల్వే డివిజన్ మెంబర్‌గా ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం చీరాల ఎంజీసీ మార్కెట్ సమావేశం హాలులో రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూడూరి శివరామకృష్ణ ప్రసా ద్, గుమ్మడి ఏసురత్నం, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, రమేష్, చంద్ర మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కట్టెల లోడు ట్రాక్టరును ఢీకొన్న కారు

ముగ్గురు వ్యక్తులకు గాయాలు



ప్రమాదం జరిగిన స్థలంలో రోడ్డుపై పడిపోయిన ట్రాక్టరు డ్రైవర్, చెల్లా చెదురుగా ఉన్న కట్టెలు

మార్టూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక వస్తున్న కారు ఢీకొన్న ఘనటలో ముగ్గురు వ్యక్తులు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదం మంగళవారం జాతీయరహదారిపై ఒంగోలు వైపు జొన్నతాళి సెంటరు సమీపంలో జరిగింది. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ దాసరి వెంకటేష్ రోడ్డుపై పడిపోయాడు. అలాగే కారు డ్రైవర్ బేతంశెట్టి హరికృష్ణ, మరో వ్యక్తి వెంకటేశ్వర్లులకు గాయాలయ్యాయి. ప్రమాద సమాచారాన్ని అందుకున్న హైవే అంబులెన్స్ వారు ఘటనా స్థలానికి వచ్చి గాయపడిన ముగ్గురినీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టరు డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులోని ఇద్దరు వ్యక్తులను 108 లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిపోయారు. మండలంలోని వలపర్ల పంచాయతీలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన ట్రాక్టరు డ్రైవర్ కట్టెల లోడుతో మార్టూరు వైపు నుంచి ద్వారకపాడు వెళుతుండగా ఒంగోలుకు చెందిన కారు ముందు వెళుతున్న ట్రాక్టరును ఢీకొట్టింది. కారులోని ఇద్దరూ ఒంగోలుకు చెందిన వారు. ఈ ప్రమాదంలో కట్టెలు చెల్లా చెదురుగా పడిపోయాయి. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సహాయం

చినగంజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : గ్రూపుల్లో ఉన్న దివ్యాంగులకు చిరు వ్యాపారాలు చేసుకోవడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని గ్రామ సంఘాలు, మండల సమైక్య ద్వారా అందజేయటానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన దివ్యాంగుల సమైక్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో ఉన్నటువంటి దివ్యాంగులందరికీ రైల్వే పాస్ అందజేస్తామన్నారు. ఆధార్, సదరం సర్టిఫికెట్, పాసుపోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నెంబర్, డాక్టర్ లెటర్‌ను వెలుగు కార్యాలయంలో అందజేయాలన్నారు. చెవిటి మిషన్స్ కావలసిన దివ్యాంగులు కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మీ, మాధవి, అకౌంటెంట్ పద్మావతి, మండల వికలాంగుల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.విశ్రాంతమ్మ, సభ్యులు వేణుబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

అవకతవకలపై.. అలసత్వం

(5వ పేజీ తరువాయి)

అద్దెకిచ్చిన దాఖలాలే లేవు. ఇలా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయడంలో గోప్యత పాటించడంతో పాటు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంలోనూ వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇష్టారీతిన వైసీపీ తన అనుయాయులకు దోచిపెట్టినా వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ యంత్రాల యూనిట్ల విషయంలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదు. సదరు యూనిట్ల కోసం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పటి ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

రైతులకు వ్యక్తిగతంగా రాయితీ యంత్రాలను 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చింది. గ్రూపులకు యంత్రపరికరాల యూనిట్లు ఇచ్చేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే రాయితీ పరికరాల జాబితా ట్రాక్టర్ లేకపోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దానిని తిరిగి చేర్చారు. ఆ తర్వాత రాయితీ విషయంలో అస్పష్టత, యంత్రాలను అందించే కంపెనీల ఎంపికలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి 15 లక్షల యంత్రాలను అందించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం ప్రభుత్వమే రాయితీ ఇవ్వగా, మిగిలిన పది శాతం ఆయా గ్రూపు సభ్యులే భరించాలి. సదరు యూనిట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచి అవసరమైన రైతులకు నామమాత్రపు అద్దెకు ఇవ్వాలి. ఇందుకు ఎంతమంది రైతులు వాటిని వాడుకున్నారనే అంశంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు కూడా నిర్వహించాలి. వసూలు చేసిన అద్దె విషయంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలన్నది నిబంధన విధించారు. మొత్తమ్మీద ప్రతిదశలోనూ అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం నడిపింది. చివరకు బాపట్ల జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాల పరిధిలో 270 చోట్ల మాత్రమే యూనిట్లను మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో 249కు 205 చోట్ల, పల్నాడు జిల్లాలో 421 కేంద్రాలకు 290 కేంద్రాల్లో రాయితీపై యంత్రపరికరాల యూనిట్లకు పంపిణీ చేసింది. అయితే ఆయా యూనిట్లలో దాదాపు సగం చోట్ల ట్రాక్టర్లు లేకుండానే మమ అనిపించారు. కనీసం వీటి ఎంపిక అయినా పారదర్శకంగా జరిగిందంటే దాదాపు 50 శాతం యూనిట్లు సేద్యంతో ఏ మాత్రం సంబంధం లేని వైసీపీ నేతల అనుచరగణం వద్దనే ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల వద్దే పరికరాలను ఉంచాలనే నిబంధనకు పాతరేసి సొంత ఆస్తిలాగా తమ ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులకు యంత్రాల అవసరమొస్తే వారి ఇళ్ల ముందు పడిగాపులు కాసే పరిస్థితి తీసుకొచ్చారు. రైతులపై కూడా పార్టీ ముద్ర వేసి రాయితీ యంత్రాల ఫలాలకు దూరం చేశారు.

సమస్యలతో సాయికాలనీవాసులు సతమతం

- వసతుల లేక ఇబ్బందులు
- తాగునీరు, రహదారి లేక అవస్థలు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని బుర్లవారి పాలెం పంచాయతీ సాయికాలనీ గ్రామస్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు. కాలనీలో సుమారు 500 కుటుంబాలకు పైగా రోజువారీ కూలీలు, నిరుపేదలు నివాసం ఉంటున్నారు. వీరికి తాగునీరు, రహదారులు వంటి కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కాలనీలో 4 ప్రధాన వీధులు ఉన్నాయి. అధికారులు ఒకచోట ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. యువకులు, పురుషులు మాత్రం వారి వాహనాల ద్వారా ప్లాంట్ వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వృద్ధులు, రోగాలతో బాధప డుతున్న మహిళలు కాలనీ శివారులో ఉన్న ప్లాంట్ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి లేక నానా యాతన పడుతున్నారు. ఇదిలావుండగా కాలనీలో ఉన్న ప్రధాన రహదారి కొంత కాలనీ పరిధిలో మరికొంత కొత్తపేట పరిధిలో ఉంది. ఈక్రమంలో దానిని ఆసరాగా చేసుకున్న రెండు ప్రాంతాల అధికారులు రహదారి మరమ్మతుల విషయంలో పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి ఎక్కువ భాగం గుంతులు పడి దారుణంగా మారింది. ప్రమాదకరంగా ఓ వంలుపు కూడా ఉంది. రాత్రయితే ప్రయాణించే వాహన చోదకులు తిప్పలు పడుతున్నారు. పైగా విద్యుత్ దీపాల సౌకర్యం కూడా లేదు. ఈ పరిస్థితిలో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే విద్యార్థినులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. తమగోడు అధికారులు పట్టించుకొని విద్యుత్ దీపాలు, తాగునీరుతో పాటు రహదారి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

రాత్రి వేళల్లో ప్రయాణం భయానకం



రహదారి గుంతల మయంగా ఉంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పైగా రహదారిలో విద్యుత్ సౌకర్యం లేదు. ఈక్రమంలో నిత్యం నిరుత్సాహంగా ఉంటుంది. చిన్నారులు రాత్రి వేళల్లో ప్రయాణమంటే భయపడుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

- రామకృష్ణ, స్థానికుడు



అస్తవ్యస్తంగా ప్రధాన రహదారి



ప్రమాదకరమైన సాయికాలనీ మలుపు

తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం



ఇంట్లో పిల్లలు ఉన్నవారు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. నాకు నీరు తెచ్చుకునే శక్తి లేదు. అంత దూరం వెళ్లలేను. నాలాగే ఇక్కడ వృద్ధులు కొందరు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. స్కూల్ సమీపంలో మరో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుంది.

- పద్మ, స్థానిక వృద్ధురాలు

సమన్వయంతో పనిచేయండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్, వేదికపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శింగరకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం శింగరకొండలో అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌఖర్యం జరగకుండా స్వామి వార్ల దర్శనం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి చిన్న సంఘటన జరిగినా వెంటనే స్పందించి మిగిలిన శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు.

డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ విద్యుత్ ప్రభలపై అశ్లీల, అర్ధనగ్న ప్రదర్శనలను అనుమతించేది లేదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కు వగా విద్యుత్ వెలుతురు ఉండే విధంగా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుం డా వాహన చోదకులు పార్కింగ్ స్థలాలలో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు. సమావేశంలో ఆలయ ఈవో తిమ్మానాయుడు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, సీఐ సుబ్బరాజు, ఈవోఆర్డీ ప్రసాదరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిరునాళ్ల సందర్భంగా రోడ్డు వెంబడి రెండువైపులా ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

శింగరకొండ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

14న ప్రధాన తిరునాళ్ల

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధాన తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అనంతరం జ్యోతి ప్రజల్వన చేసి తిరునాళ్ల ఉత్సవాలను పారంభించనున్నట్లు ఆలయ ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపస్థాపన, మండపారాధన, 9 గంటలకు జీవ ధ్వజ పూజ, ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు గజవాహన సేవ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. రెండవరోజు గురువారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారికి విశేష అభిషేకం, 108 మంది వేద విద్యార్థులతో వేద పఠనం, స్వస్తి, రాత్రి 7 గంటలకు ఉష్ట్ర వాహన సేవ ఉంటుంది. 14వ తేదీ శుక్రవారం ప్రధాన తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం 10 గంటలకు దేవస్థానం వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులచే మన్యుసూక్త పారాయణ, హోమం, రాత్రి 7 గంటలకు రథోత్సవం ఉంటుంది. స్వామి దివ్య దర్శనము 14 వ తేది ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ శనివారం మధ్యాహ్నం 1 గంట వరకు నిర్విరామంగా జరుగుతుందని ఈవో వివరించారు. శింగరకొండలో సందడి సందడిగా మారింది. దేవాలయంతో పాటు, పరిసర ప్రాంతం మొత్తం విద్యుత్‌దీపాల వెలుగులు ఉండేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అన్ని అన్నదాన సత్రాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 5 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

తాబేళ్ల మనుగడకు భంగం కల్గిస్తే చర్యలు



తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదులుతున్న అటవీశాఖాధికారి భీమయ్య

చినగంజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య హెచ్చరించారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడు చెట్లపాలెం తీర ప్రాంతంలో రాష్ట్ర అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ వారు నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి మంగళవారం ఆయన తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదిలారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో మొట్టమొదటి సారిగా 107 తాబేళ్ల పిల్లలను సముద్రం లోనికి వదలినట్లు తెలిపారు. కుంకుడుచెట్లపాలెం సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో 14 తల్లి తాబేళ్ల నుంచి 1400 గుడ్లను సేకరించినట్లు తెలిపారు. వాటిలో 115 గుడ్ల నుంచి 107 పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి వదలినట్లు తెలిపారు. సముద్రపు తాబేళ్ల జాతి అంతరించి పోయే జాబితాలో ఉందని, వాటిని కాపాడే ప్రయత్నం అటవీశాఖ చేస్తుందని తెలిపారు. సముద్ర తాబేళ్ల సమాచారం ఎవరైనా తెలిస్తే మా సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల రక్షణ దళసభ్యులు కారాని శ్రీను, వాయల జాలయ్య, కే.వెంకటేష్, గ్రామస్తులు నగయ్య, గోపిరాజు పాల్గొన్నారు.

జోరుగా బర్లీ పొగాకు కొనుగోళ్లు

సంతృప్తిగానే ధరలు



మేదరమెట్లలో బారులుతీరిన పొగాకు చెక్కలతో ఉన్న వాహనాలు

మేదరమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు బర్లీ పొగాకు పండిస్తున్నారు. ముఖ్యంగా వినుకొండ, గిద్దలూరు, కొరిశపాడు. జే.పంగులూరు, మార్టూరు, దర్శి ప్రాంతాల్లో పండించిన బర్లీ (తెల్ల) పొగాకు మేదరమెట్ల చుట్టుపక్కల ఉన్న కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. కొరిశపాడులో జీపీఐ, మేదరమెట్లలో మద్ది లక్ష్మయ్య, మహలక్ష్మీ (పోలిశెట్టి సోమసుందరం) గుండ్లపల్లిలో ఐటీసీ తదితర కంపెనీలు బర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 25 మిలియన్ల పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. గడిచిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో రైతులు ధరలు తగ్గుతాయని మొదట్లో కొంత ఆందోళన చెందారు. గత సంవత్సరం బర్లీ పొగాకు గ్రేడ్ 1 ధర కేజీ 150 రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం జీపీఐ, ఐటీసీ కంపెనీలు బర్లీ పొగాకు గ్రేడ్ 1 రకాన్ని 155 రూపాయలకు కొనుగోలు చేస్తున్నాయి. తక్కువ రకం (అడుగాకులు) 110 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరాసరిన 147, 148 చెందుతుందని వ్యాపార ప్రతినిధులు తెలిపారు. మేదరమెట్ల, కొరిశపాడు, గుండ్లాపల్లిలోని కొనుగోలు కేంద్రాల వద్ద పొగాకు చెక్కులు ఉన్న ట్రాక్టర్లు, నాలుగు చక్రాల ఆటోలు బారులు తీరుతున్నాయి. రైతులు కూడా ధరల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు ఇబ్బందికరంగా లేవంటున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయని బర్లీ సాగుదార్లు అంటున్నారు.

ఒకప్పుడు పొగాకు వ్యాపారానికి కేంద్రగా బాసిల్లిన మేదరమెట్లకు నేడు పూర్వ వైభవం వచ్చినట్లుగా కొందరు వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 70వ దశకంలో మేదరమెట్లలో పెద్ద పెద్ద పొగాకు కంపెనీలు, పొగాకు కొనుగోళ్ల గ్రేడింగ్‌లు నిర్వహించేవి. 80వ దశకం చివర్లో పొగాకు గూడెంలలో ఎక్కువ భాగం జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులుగా రూపాంతరం చెందాయి. అప్పట్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు పొగాకు కంపెనీలల్లో గ్రేడింగ్‌కు వచ్చేవారంటూ గ్రామస్థులు పాత స్మృతులను నెమరవేసుకుంటున్నారు.

ఇష్టపడి చదవండి

అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు



మేదరమెట్ల హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై మహమ్మద్ రఫి

మేదరమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితే సులభంగా లక్ష్యాలను చేరుకోవచ్చని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10 తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రఫి అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ 10వ తరగతి మార్కులు ఉన్నత విద్యాభ్యాసానికి, భవిష్యత్‌లో ఉద్యోగాలకు సంబంధించి కూడా ఎంతో అవసరం అవుతాయన్నారు. ఇప్పుడు కష్టపడి పట్టుదలతో చదివితే భవిష్యత్‌లో చింతించే అవసరం ఉండదన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా విద్యాభ్యాసం సాగించాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు చదుకోవడానికి అనువైన వాతావరణం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద జనరిక్ మెడికల్ షాపుల కోసం రుణాలు మంజూరు చేస్తుందని, బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఆరకాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. 23 నుంచి 25 వరకు దరకాస్తుల పరిశీలిన, 26 నుంచి 30 వరకు బ్యాంకర్లు పరిశీలన ఉంటుందన్నారు.

ముమ్మరంగా శనగ నూర్పిళ్లు

- అరకొరగా దిగుబడులు
- తగ్గిన గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతులు

ఇంకొల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విస్తారంగా సాగు చేసిన శనగ పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఆశించిన మేరకు దిగుబడులు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శనగ ధర క్వింటా జేజే 11 రకం రూ.5700 మాత్రమే పలుకుతోంది. రెండు నెలల కిందట రూ.6,500పైన పలకగా శనగ చేతికి వచ్చే సమయానికి ధర తగ్గిపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లరకం శనగ ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు, ఎర్ర శనగ ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. గత ఏడాదిలో పండించిన శనగలు ఇంకా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్నాయని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా శనగను కొనాలని రైతులు కోరుతున్నారు.

నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


చిననందిపాడు ప్రధాన రోడ్డులో నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న కరెంట్ వైర్లు

- చిననందిపాడులో ప్రధాన రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

చిననందిపాడు (పర్చూరు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం చిననందిపాడులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎన్ని మార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో చేస్తాం కాలయాపన చేస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు అంటున్నారు. నేలవాలి స్తంభాలు, జారిపోయిన వైర్ల ద్వారానే కరెంట్ సరఫరా అవుతుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్తంభాలతో పశువులకు ప్రమాదం పొంచిఉందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరుస విద్యుత్ ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ సీనానాయక్

జీవన జ్యోతి బీమా చెక్కు అందజేత

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఏల్చూరి సునీత అను మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అమె బల్లికురవ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవన జ్యోతి స్కీంలో చేరి ఉన్నారు. ఈ పథకం ద్వారా మృతురాలికి రూ.లక్షల బీమా నగదు మంజూరైంది. బ్యాంక్ మేనేజర్ సీనానాయక్ బీమా చెక్కును సునీత భర్త ప్రసాద్‌కు మంగళవారం అందజేశారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతాలు ఉన్న ప్రతి సభ్యుడు ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకంలో చేరాలని కోరారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయెగమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సుహితా గ్రేస్, బిందు మాధవి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు, ఈబీసీ కులాలకు చెందిన వారికి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, అర్హత ఉన్న వారు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సచివాలయాలలో వివరాలను తెలుసుకొని వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని, కాపులకు, బీసీలలోని పలు కులాలకు ఈ రుణాలు అందిస్తారని అమె తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలను అందజేసిన సాఫ్ట్‌వేర్


వల్లాపల్లిలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగి

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తాను చదివిన పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను అందజేయగం తనకు ఎంతో ఆనందరంగా ఉందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పరుసు సాల్మన్ అన్నారు. మంగళవారం వల్లాపల్లి సీఏయూపీ పాఠశాలలో అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాల్మన్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అవసరమైన ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ పరుసు సునీల్‌కుమార్, అంగన్ వీడీ కార్యకర్త అనుపమ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్ను వసూలును వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన యద్దనపూడి మండలంలోని యద్దనపూడి గ్రామంలో మరమ్మతులకు గురైన చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవో ఆర్‌డీ కృష్ణతో మాట్లాడారు. వెంటనే చెత్త సంపద కేంద్రానికి మరమ్మతులు చేయాలన్నారు. ఇంఇంటికీ వెళ్లి చెత్తసేకరణ చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ వలేరు రేణుకమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుతో మాట్లాడారు. మండలంలోని అన్ని గామాలలో ఇంటిపన్ను వసూళ్లపై కృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరితంగా ఇంటి పన్నులు వసూలుచేయాలన్నారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి

వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేష్, జైసన్‌బాబు తదితరులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నేడు బాపట్ల కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న వైఎస్సార్ ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం రామకృష్ణాపురం నియోజకవర్గ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మునిసిపల్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సీజ్

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న స్థావరంపై ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడున్న ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

నిందితుడికి రెండేళ్ల జైలు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోను నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి, మరొకరు గాయపడడానికి కారకుడైన నిందితునికి చీరాల ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్షను విధించారు. 2018 సంవత్సరంలో నిందితుడు ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ మరో ఆటోను ఢీకొట్టాడు. ఈక్రమంలో ఎదురు ఆటోలో ప్రయాణిస్తున్న వెల్లినేని వెంకట వినోద్ మృతి చెందగా, మరో ప్రయాణికుడు జోగేశ్వరరావు గాయపడ్డారు. ఈమేరకు అప్పటి రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి కేసు నమోదు చేసి అభియోగపత్రం దాఖలు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఒకరి మృతికి కారకుడైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువడించింది.

పేదల సమస్యలు పరిష్కరించాలి

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో నిస్సహాయులుగా మగ్గుతున్న నిరుపేదల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎస్.బాబూరావు అన్నారు. స్థానిక సంస్థలపై ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునిసిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీని వారు సందర్శించారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ జయరాజ్, భగవాన్ దాస్, రాంబాబు, ఏసుపాదం పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఘనత చాటుతున్న చీరాల క్రీడాకారులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు చీరాల ఘనతను ఉన్నతంగా చాటుతున్నారని ప్రముఖ వైద్యుడు డా.రామకృష్ణ, డా. బాబూరావు. డా.రమేష్ అన్నారు. ఈ నెలాఖరులో గోవాలో జరుగనున్న జాతీయ స్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన సీనియర్ క్రీడాకారులు తుపాకుల నాగేశ్వరరావు, సుహాసిని, అంకాలు, సుమన్, కిరణ్మయిని ఇండోర్ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌మూర్తి, మోహన్‌రావు, కేదార్నాథ్, సత్యనారాయణ, నాగరాజు, నాగేశ్వరరావు, రాయుడు, దాసు పాల్గొన్నారు.

నిమ్మతోటను పరిశీలించిన జిల్లా అధికారులు


నిమ్మకాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి విజయలక్ష్మి, మేనేజర్ కిరణ్

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని ముప్పవరం పంచాయతీ పరిధిలోని నిమ్మతోటను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఏపీ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నిమ్మతోట సాగు చేసిన మహిళా రైతు ఇంటూరి గోవిందమ్మతో మాట్లాడారు. సాగుకు ఎంత ఖర్చు చేశారు, ఏఏ మందులను వినియోగిస్తున్నారు, నిమ్మతోట సాగుపై ఆసక్తికి గల కారణాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గోవిందమ్మను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ పీ కిరణ్, సంతోషం పాల్గొన్నారు.

భగవద్గీతపై పట్టుసాధించిన యామిని

ఆలయ కమిటీ అధ్వర్యంలో సన్మానం


యామినిని సన్మానిస్తున్న దత్తపీఠం మహిళా ప్రతినిధులు

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో భగవద్గీతపై ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల్లో ప్రతిభ సాధించిన వారికి గోల్డ్‌మెడల్‌ను అందజేస్తారు. అందులో భాగంగా ఈఏడాది నిర్వహించిన అన్‌లైన్ పోటీలో పర్చూరుకు చెందిన పోలిశెట్టి యామిని సత్తాచాటి గోల్డ్‌మెడల్‌ను కౌవసం చేసుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక అష్టలక్ష్మి ఆలయంలో దత్తపీఠం మహిళా ప్రతినిధులు యామినిని ఘనంగా సన్మానించి అభినందించారు.

అవగాహనతోనే అధిక దిగుబడి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వేటపాలెం(చీరాల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో ఆధునికీకరణ పద్ధతులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లరిపాలెం, బచ్చుల వారిపాలెంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, విధివిధానాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డా. టీ ప్రేమరంజితం, మనోజ్ పూరీ గోస్వామి, రైతులు పాల్గొన్నారు.

చీరాల మండలంలో

మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై వ్యవసాయాధికారి సుమతి అవగాహన కల్పించారు. సబ్సిడీపై ఎస్సీ ఎస్టీ, జనరల్ రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఏఏ షీబా, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఎంఈవో కార్యాలంలో పోషణ్ బీ పడాయిబీపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సూపర్‌వైజర్ సలోమి కార్యకర్తలకు ఈ శిక్షణ గురించి వివరించారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంపై వారికి పలు సూచనలు చేశారు.

ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి కృషి

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య


మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య, పక్కన ఆప్కో చైర్మన్ హేమలత, ఇతర నాయకులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని, ఈక్రమంలోనే ఏరియా హాస్పిటల్లో త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. చీరాల చుట్టు పక్కల నుంచి నిత్యం అధిక సంఖ్యలో ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అత్యవసర సేవలకు గుంటూరు, ఒంగోలు వెళుతున్న నేపథ్యంలో ఆ సేవలు కూడా సామాన్యులకు చీరాల్లోనే అందాలని మంత్రిని కోరడంతో సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న క్వశ్చన్ అవర్‌లో తీర ప్రాంత ప్రజల చిరకాల కోరిక రామాపురం ఫిషింగ్ హార్బర్ స్థితిగతులపై ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంట ఆప్కో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, మాజీ సర్పంచ్ జంగిలి రాముడు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యానేరం

ఈఈ జాన్ థామస్

కారంచేడు(పర్చూరు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని బాపట్ల జిల్లా విద్యుత్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈఈ) జాన్ థామస్ అన్నారు. కారంచేడు మండలంలో మంగళవారం విద్యుత్ తనిఖీలను ఆయన నిర్వహించారు. ఈ తనిఖీల్లో 87 మందిపై కేసులు నమోదు చేసి రూ.3,59,000వేల అపరాధ రుసుము విధించినట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, వేటపాలెం, చీరాల డీఈఈలు కారంచేడు ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు గ్రామంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

60 మంది రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల నగదు అందజేత

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడి వారి ఆదేశాలు మేరకు మండలంలోని ప్రజల సహకారంతో 60 మందిని రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులుగా నమోదు చేసినట్లు తహసీల్దార్ పోపూరి సింగారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 60 మంది సభ్యులకు సంబంధించి ఒక్కొక్కరి దగ్గర రూ.1100 చొప్పున నగదును మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి ఇమ్మానియేల్‌కు తహసీల్దారు కార్యాలయంలో అందచేసినట్లు సింగారావు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన సభ్యులకు తహసీల్దారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట ముసాయిదా


మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

అద్దంకిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ-పంట ముసాయిదా జాబితాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రబీలో సాగుచేసిన అన్ని పంటల వివరాలను రైతు సేవా కేంద్రాలల్లో ప్రదర్శించామని, రైతులందరూ తప్పకుండా జాబితాలను తనిఖీ చేసుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేయించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ పొందే రైతులు విశిష్ట సంఖ్యను తప్పని సరిగా పొందాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సీత, రైతులు పాల్గొన్నారు.

పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలి

పంగులూరు : రైతులు తమ పొలాలకు భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాత వాటి ఆధారంగా సాగు చేస్తున్న పంటలకు ఎరువులను వినియోగించవచ్చునని వ్యవసాయ అధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని రేణంగివరం, కశ్యాపురంలో మొక్కజొన్న, పొగాకు, బీర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ భూసారపరీక్షలు చేయించుకుంటే పంటలకు సోకిన తెగుళ్లు, పురుగులు ఉధృతిని నివారించడానికి సరైన ఎరువులను వినియోగించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కె అధికారి కె శివాని, నాయకులు ధూళిపాళ్ల నారాయణస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

శనగలు, మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలు

మార్టూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం శనగలు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోద్దని సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని రాజుపాలెం, డేగరమూడి గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆయన రైతులతో మాట్లాడుతూ శనగలు, మొక్కజొన్నను అమ్ముకోవలసిన రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రూ.12.69లక్షల వ్యయంతో 75 యంత్ర పరికరాలను కేటాయించామన్నారు. అవసరమైన రైతులు సంప్రదించాలని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి అంజిరెడ్డి, విస్తరణాధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బాలల హక్కుల పరిరక్షన కమిషన్ సభ్యురాలు పద్మావతి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు శుచి, శుభ్రతతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షన కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. మంగళవారం పర్చూరులోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వసతి గృహంలో చీమలు పట్టిన ఆహార పదార్థాలను ఆమె గుర్తించి ఇలాంటివి మీ పిల్లలకు పెడతారా అని ప్రిన్సిపాల్ శ్రీనునాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడునెలలుగా ఈ వసతిగృహంపై ఫిర్యాదులు అందుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు అనుగుణంగా వసతి గృహం లేదని, చాలీచాలని వసతులతో ఇబ్బంది పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దండిస్తున్నట్లు అందిన ఫిర్యాదుమేరకు సంబంధిత ఉపాధ్యాయులను ప్రశ్నించారు. బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆమె ఆదేశించారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా ఆమె భోజనం వడ్డించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంఈవో పి.వెంకట్రామయ్య, సీడీపీవో సుభద్ర, ఏఎస్సై సురేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చీరాలలోని ఓ ప్రైవేటు స్కూల్‌ను కమిషన్ సభ్యురాలు పద్మావతి తనిఖీ చేశారు. హాల్‌టికెట్లు ఇవ్వడంలేదని అందిన ఫిర్యాదుపై ఆమె స్పందిస్తూ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పునరావృతం కావద్దని తెలిపారు. సమస్యలేమైనా ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు.